కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :102 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ బుధవారం 05-08-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## వడివడిగా బుల్లెట్ రైల్ హబ్ పనులు



హైదరాబాద్, ఆగస్టు 4 , బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు గురించి తాజా సమాచారం అందుతోంది. శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో నిర్మాణం జరుగుతున్న బుల్లెట్ రైల్ హబ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ప్రాజెక్టు హైదరాబాద్? నుంచి వికారాబాద్? మీదుగా పుణెకు వెళ్లనున్న రైలు మార్గాన్ని సూచిస్తున్నాయి. గూగుల్ ఎర్త్ మ్యాప్‌లలో ఈ మార్గం బహదూర్?గూడ, సయ్యద్?గూడ, పెద్ద గోల్కొండ, నందిపల్లి, రషీద్?గూడ, మంఖాల్ గ్రామాల మీదుగా వెళ్తుందని స్పష్టం అవుతోంది. రైతులు ఈ మార్గం వల్ల తమ భూములు భూసేకరణకు గురవుతాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అధికారులు ఈ భూములను సేకరించనున్నట్లు రైతులకు తెలిపారు. అయితే, 6 గ్రామాల్లో భూసేకరణ జరుగుతుందనే అనుమానంతో రైతులు రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లారు. కానీ, వారికి సరైన సమాచారం అందించలేదు. దీంతో రైతుల ఆందోళన పెరిగింది. సోషల్? మీడియాలో వైరల్ అయిన ఫొటోలు పరిశీలిస్తే, రైలు మార్గం సుమారు 60 మీటర్ల వెడల్పు ఉందని తెలుస్తోంది. రైతులు తమ భూములలో 40 శాతం కోల్పోయామని, మళ్లీ భూసేకరణ జరిగితే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూగుల్? మ్యాప్?లోని మార్గాన్ని పరిశీలిస్తే, 3 నెలల క్రితం ఈ మార్గం ఖరారు చేయబడినట్లు తెలుస్తోంది. స్థానికులు చెప్పినట్లుగా, రైలు మార్గానికి సంబంధించిన గుర్తులను తమ పొలాలు, రహదారికి సమీపంలో వేశారని సమాచారం అందుతోంది. రవాణా రంగ నిపుణులు, హైస్పీడ్? రైల్? కార్పొరేషన్? లిమిటెడ్? అధికారులు ఈ మార్గం కోసం కన్సల్టెంట్‌ను సంప్రదించినట్లు చెబుతున్నారు. బుల్లెట్? ట్రైన్? మార్గం 17.5 మీటర్ల వెడల్పు ఉంటుందని, మొదటి మూడు రకాల అలైన్?మెంట్లు చిత్రీకరించుకున్నాక ఒకటే మార్గాన్ని ఖరారు చేస్తారని అధికారులు వివరించారు. రాజేంద్రనగర్? ఆర్డీవో శ్రీధర్? మాట్లాడుతూ, తమకు ఏ సమాచారం లేదని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.కేంద్ర ప్రభుత్వం 2026 బడ్జెట్?లో దేశవ్యాప్తంగా ఏడు హై-స్పీడ్? బుల్లెట్? రైలు కారిడార్ ప్రాజెక్టులను ప్రకటించింది. ఇందులో మూడు ప్రాజెక్టులు హైదరాబాద్? కేంద్రంగా ఉంటాయి. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల పరిధిలో నిర్మాణం కానున్నాయి. తెలంగాణ వాటా కీలకంగా మారనుంది. ఈ ప్రాజెక్టుల మొత్తం దూరం 2,028 కి.మీ కాగా, ఇందులో 512 కి.మీ మేర హైస్పీడ్? ట్రాక్? తెలంగాణలోనే రానుంది. హైదరాబాద్?-చెన్నై ప్రాజెక్టును ఎన్?హెచ్?ఎస్?ఆర్?సీఎల్? మొదట నార్కట్?పల్లి, సూర్యాపేట, ఖమ్మం మీదుగా ప్రతిపాదించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఫ్యూచర్? సిటీ, నాగార్జునసాగర్? వైపు మార్గాన్ని మార్చారు. అలాగే, హైదరాబాద్?-బెంగళూరు మార్గం తొలుత మహబూబ్?నగర్?, వనపర్తి రోడ్? వైపు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో మార్గాన్ని మార్చారు. హైస్పీడ్? రైలు ప్రాజెక్టుల ఎలైన్?మెంట్?, విశేషాలతో రవాణా, ఆర్? అండ్? బీ శాఖ స్పెషల్? సీఎస్? వికాస్?రాజ్? కేబినెట్?క నివేదిక అందించారు.శంషాబాద్?లో బుల్లెట్? హబ్? నిర్మాణం జరుగుతోంది. హైదరాబాద్? దక్షిణ భారతదేశ హైస్పీడ్? రైలు నెట్?వర్క్?కు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేలా మూడు కారిడార్లకు శంషాబాద్? వద్ద కామన్? హబ్? ప్రతిపాదించారు. ఈ మూడు మార్గాల ఎలైన్?మెంట్లు కొంత దూరం రీజినల్ రింగ్ రోడ్‌కు సమాంతరంగా వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. హైదరాబాద్?-పుణె-ముంబయి ప్రాజెక్టు డీపీఆర్? ఇప్పటికే రైల్వే బోర్డుకు చేరింది. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్?-చెన్నై ప్రాజెక్టులకు డీపీఆర్? రూపకల్పన కొనసాగుతోంది. హైస్పీడ్? కారిడార్? స్టేషన్లను వీలైన చోటల్లా మెట్రో రైలుతో అనుసంధానిస్తారు.

## సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ఇంటర్నెట్



హైదరాబాద్: తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు.

ఇక హద్దులు పక్కాగా..

ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు.అలాగే ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

## మత్స్యకారుల సంక్షేమానికి పూర్తి ప్రాధాన్యం: మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్, ఆగస్టు 4: మత్స్యకారుల సంక్షేమంపై మంత్రి వాకిటి శ్రీహరి కీలక సమావేశం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో చర్చలు జరిపారు. 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకు మత్స్యకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మధ్యాహ్న భోజనంలో చేపలను చేర్చే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. సభ్యత్వ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో చేపల విక్రయాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దోహదం చేస్తుందని చెప్పుకొచ్చారు. రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారు : టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని మహేశ్ గౌడ్ ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు. తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, టీపీసీసీ చీఫ్ ఆరోపణలపై హరీశ్ రావు, బీఆర్ఎస్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో వేచి చూడాలి.

## సీఎంఆర్ అక్రమాలపై ఉత్తమ్ ఫోకస్..



హైదరాబాద్, రాష్ట్రంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవహారంలో జరుగుతున్న అక్రమాలకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏటా బకాయిలు పడుతూ ప్రభుత్వానికి సవాలుగా మారిన సీఎంఆర్ డిఫాల్టర్లను ముందుగానే పసిగట్టేందుకు 'ఎర్లీ వార్నింగ్ సిస్టమ్'ను తీసుకురాబోతోంది. ఈ మేరకు సచివాలయంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ప్రజాధనాన్ని కాపాడటంతో పాటు పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఈ కీలక భేటీ జరగనుంది.

గత 12 ఏళ్ల లెక్కల తేల్చేందుకు బిగ్ రివ్యూ

గత 10 నుండి 12 ఏళ్ల కాలంలో మిల్లర్లకు కేటాయించిన ధాన్యం ఎంత? దానికి సరిపడా బియ్యం ప్రభుత్వానికి ఎంత అందింది? అనే అంశాలపై మంత్రి లోతుగా సమీక్షించనున్నారు. ఏటా జిల్లాలు, సంవత్సరాలు, మిల్లుల వారీగా సీఎంఆర్ డిఫాల్టర్ల జాబితాను రూపొందించి, బకాయిల అసలు విలువను తేల్చనున్నారు. ఒక్క క్వింటాల్ బియ్యం, ఒక్క రూపాయి బకాయి కూడా వదలకుండా ప్రతీదీ రికవరీ చేయాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది.

కఠిన చర్యలు.. ఆస్తుల జప్తుకు ఆదేశాలు

డిఫాల్టర్లుగా మారిన మిల్లర్లపై కేవలం నోటీసులతో సరిపెట్టకుండా రెవెన్యూ రికవరీ చట్టం కింద వేగవం తమైన చర్యలు తీసుకోనున్నారు. అవసరమైన చోట సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు డిఫాల్టర్ల చర, స్థిరాస్తులను జప్తు చేసే ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. బ్యాంకు

## తెలంగాణలో అగమ్యగోచరంగా ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి



హైదరాబాద్, ఆగస్టు 4 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో TVVP పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

అధికార యంత్రాంగమే లేకుండా పోయింది..

ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఎవూని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు.

వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారు..

దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతోందని తెలిపారు. రోడ్లెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని,తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

### నడి రోడ్డుపై వ్యక్తిపై హత్యాయత్నం

హైదరాబాద్,నడి రోడ్డు పై వ్యక్తిని దారుణంగా చంపే ప్రయత్నం చేసారు దుండగులు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీలో ఘటన జరిగింది. హమేర్(35) అనే వ్యక్తిపై హత్యాయత్నం చేసారు. హమేర్ పై గంజాయి బ్యాచ్ కత్తితో దాడి చేసిందని సమాచారం.

## తెలంగాణాలోని ఆస్తులన్నీ అనుభవించేది వారే కదా

హైదరాబాద్, తెలంగాణలోని ఆస్తులన్నీ తెలుగువారే అనుభవిస్తున్నారని..దానికి తాను ఎప్పుడూ బాధపడేదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆస్తుల పంపకం సరిగా జరగలేదని ఆయన అన్నారు.2019 తరువాత రాష్ట్రం ఎన్ని విధాలుగా నాశనం అవ్వాలో అన్ని విధాలుగా నాశనం అయ్యిందని పేర్కొన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతనే బ్రాండ్ ఏపీని పునరుద్ధరించినట్లు ఆయన వివరించారు.

ఏమేం చెప్పామో అవన్నీ...

2014 ఎన్నికల సమయంలో ఏమేం చెప్పావెూ అవన్నీ చేస్తున్నామని, 2025-26లో పది సూత్రాలతో స్వర్ణాంధ్ర విజన్ 2047 తయారుచేశామని సీఎం చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి మంగళవారం ఆర్థిక శాఖపై శ్వేత పత్రం విడుదల చేశారు.'ఆర్థిక శాఖలో రెండు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం ఎలాంటి ఎఫర్ట్ పెట్టామనేది అందరికి తెలియాలి. పాలన బాగుంటే ప్రజల మీద పెద్ద ప్రభావితం చేస్తుంది. నెగటివ్ గవర్నన్స్ ఉంటే నెగటివ్ ప్రభావం చేస్తుంది. 2024లో ఒక అఖండ విజయం సాధించాం. 2019-24లో విధ్వంస పాలన సాగింది. ప్రజలందరూ భయంతో బ్రతికారు. 1982 ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు ఒక విప్లవం.. 1994లో కాంగ్రెస్ పార్టీకి 26 సీట్లు వచ్చాయి.



## విద్యా వ్యవస్థ అంత దారుణమా...

హైదరాబాద్, మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు లక్షా పదివేల మంది విద్యార్థులు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పట్టాలు పొందుతున్నారు. కానీ ఈ పట్టాలు చేతపట్టుకుని బయటకు వస్తున్న యువతలో కేవలం పదిహేను శాతం మంది మాత్రమే పరిశ్రమల ప్రమాణాలకు సరిపోతున్నారు. మిగిలిన మెజారిటీ విద్యార్థులు కనీసం ప్రాథమిక కోడింగ్ లేదా కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల పరిస్థితిని ప్రస్తావిస్తూ కఠినమైన వ్యాఖ్యలు చేశారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే గతంలో కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు నేతల మాటల శైలి వేరుగా ఉన్నప్పటికీ వారిద్దరి ఆవేదన వెనుక ఉన్న ప్రధాన కారణం మన విద్యావ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన లోపమే. సాంకేతిక విద్య ఈ స్థాయికి దిగజారడానికి ప్రధాన కారణం విద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారమయం కావడమే. గత కొన్ని సంవత్సరాలుగా పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ కళాశాలల్లో తగినంత మౌలిక వసతులు అసలే లేవు. ఆధునిక ప్రయోగశాలలు లేకపోవడం అలాగే అనుభవం ఉన్న నాణ్యమైన అధ్యాపకుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు వేగంగా దూసుకుపోతుంటే చాలా కాలేజీలు ఇంకా కాలం చెల్లిన సిలబస్ నే బోధిస్తున్నాయి. ప్రాక్టికల్స్ కేవలం పుస్తకాల్లోని విషయాలను గుడ్డిగా గుర్తుపెట్టుకుని రాసే రీతిలోనే ఉంటున్నాయి. దీనివల్ల విద్యార్థుల్లో సమస్యలను స్వయంగా పరిష్కరించే ధోరణి పూర్తిగా కరువవుతోంది. తల్లిదండ్రులు తమ కష్టపడిన సంపాదనతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు సాయాన్ని కలిపి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. పిల్లలను ఎంతో ప్రయాసపడి ఇంజినీరింగ్ చదివిస్తే ప్రైవేట్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు రావడం లేదు. దీనితో నిరుద్యోగ యువత తీవ్ర నైరాశ్యంలోకి వెళ్లిపోతూ చివరకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. ఇంజినీరింగ్ పాసైన కుర్రాడు కనీసం చిన్న ఉద్యోగానికైనా సరిగ్గా వెళ్లలేకపోతున్నాడనే ఆవేదన పాలకుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. నాయకులు చేసిన తీవ్రమైన వ్యాఖ్యలు ఎవరి మనోభావాలను కించపరచాలనే ఉద్దేశం లేదు. అక్కడ కనిపిస్తున్నది సమాజం ముందున్న ఒక స్పష్టమైన వాస్తవం. పరిశ్రమల అవసరాలకు తగ్గ ప్రాక్టికల్ నైపుణ్యాలు లేకపోవడం వల్ల యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన శిక్షణ లేని కారణంగా కనీసం ఒక చిన్న దరఖాస్తును కూడా సరిగ్గా రాయలేని స్థితిలో విద్యార్థులు బయటకు వస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి కేవలం విమర్శలు సరిపోవు కానీ సరైన ప్రణాళికలు అవసరం. కాలేజీలు కేవలం మార్కులు అలాగే సర్టిఫికెట్లు ఇచ్చే యంత్రాలుగా మారడం వల్ల సమాజానికి ఒరిగేదీ ఏమీ లేదు. సాంకేతిక రంగంలో ప్రపంచంతో పోటీపడే అర్హతలను విద్యాప్రమాణాలు పూర్తిగా మారాలి. అప్పుడే యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుంది. ప్రస్తుత తరానికి అర్థమయ్యేలా సులభమైన మంచి తెలుగులో మన విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసుకోవాలి. యువత కేవలం డిగ్రీ పత్రాల కోసం కాకుండా నిజమైన నైపుణ్యాలు సంపాదించే దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వం కూడా కాలం చెల్లిన సిలబస్‌ను మార్చి పరిశ్రమలకు కావాల్సిన కోర్సులను కాలేజీల్లో ప్రవేశపెట్టాలి. అప్పుడే ఈ రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచ వేదికపై గర్వంగా నిలబడగలుగుతాడు. నేటితరం యువతకు కావాల్సింది కేవలం డిగ్రీ కాదు కానీ అద్భుతమైన సృజనాత్మకత. ఈ దిశగా అందరూ కలిసికట్టుగా ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

## కంచుకోటలో సవాళ్లు....

అనంతపురం, ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ కి కంచు కోటగా గుర్తింపు పొందింది. రాజకీయ పరిస్థితులు ఎలా మారినా ఈ ప్రాంతంలో పార్టీ తన ప్రభావాన్ని నిలబెట్టుకుంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసినప్పటికీ, హిందూపురం , ఉరవకొండ వంటి నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు సాధించింది. 2024 ఎన్నికల్లో కూడా జిల్లా వ్యాప్తంగా పార్టీ మరింత బలపడింది. అయితే ఇప్పుడు జిల్లాలో పార్టీ నాయకత్వం ఆశించినంత చురుకుగా కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఇటీవల రాజకీయ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదని కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది. మంత్రి పదవులు లేదా ఇతర కీలక బాధ్యతలు ఆశించిన కొందరికి అవి దక్కకపోవడం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం జరగడం వంటి అంశాలు ఈ పరిస్థితికి కారణమయ్యాయనే ప్రచారం ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వం తమ తమ వర్గాలకే పరిమితమవుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు ఒకే దిశగా సాగడం లేదని పరిశీలకులు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం బలహీనంగా ఉండటం వల్ల కేడర్‌లో కూడా కొంత నిరుత్సాహం కనిపిస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన ఇంటింటికీ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో అమలు చేయడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ , కాల్వ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం కొంత చురుకుగా సాగుతున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆశించిన వేగం కనిపించడం లేదని పార్టీ వర్గాలే అంటున్నాయి. చాలా చోట్ల ఇంటింటికీ కార్యక్రమం కంటే సమావేశాలు, సమన్వయ చర్చలు, కార్యకర్తల నియామకాలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ప్రజల్లో పార్టీ కార్యక్రమాల ప్రభావం తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది సీనియర్ నాయకులు ఉండటం కూడా సమన్వయానికి సవాలుగా మారిందని అంటున్నారు. ప్రతి నాయకుడు తన రాజకీయ ప్రాధాన్యతను నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో ఉండటంతో కొన్ని చోట్ల అంతర్గత పోటీ పెరిగినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల మధ్య అభిప్రాయ భేదాలు కూడా అప్పుడప్పుడు బయటపడుతున్నాయని సమాచారం. ముఖ్యంగా తాడిపత్రి, హిందూపురం , పెనుకొండ వంటి కీలక నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఈ పరిస్థితులను పార్టీ అధిష్ఠానం సమయానికి చక్కదిద్ది, నాయకత్వం మరియు కేడర్‌ను ఒకే వేదికపైకి తీసుకురాగలిగితే జిల్లా స్థాయిలో పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుతం నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపడం టీడీపీకి అత్యంత కీలకమైన అంశంగా మారింది.

### మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అరెస్ట్

ఉరవకొండ,సోమవారం నాడు ఉరవకొండ వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం.. తోపులాట జరిగింది. అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మంత్రి పయ్యావుల కేశవ్ కుట్ర రాజకీయాలకు నిరసనగా వైసీపీ ధర్నా కు ప్రయత్నించింది. వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఉరవకొండలో పోలీసులు ఉరవకొండలో భారీగా మోహరించారు. విడపనల్ మండలం వేల్పుమడుగులో వైసీపీ నేత గోవిందు్క

# జెన్ జీ టచ్ లో జనసేన...




కాకినాడ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్ జీ యువత కేంద్రంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీని సైతం అదే ఆధునిక స్థాయిలో తీర్చిదిద్దాలని పవన్ గట్టిగా భావిస్తున్నారు. కేవలం పాత పద్ధతుల్లో కాకుండా మారుతున్న టెక్నాలజీ, సోషల్ మీడియా, సరికొత్త ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధికార ప్రతినిధుల కమిటీని రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 మంది నాయకులను వారి బాధ్యతల నుంచి తప్పించారు. నూతన నియామకాలు పూర్తి అయ్యే వరకు టీవీ డిబేట్లు, మీడియా సమావేశాలలో ఎవరూ పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సంస్థాగత ప్రక్షాళన దిశగా ఈ నిర్ణయం చాలా కీలకమైన అడుగుగా రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమూల మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రకాశం అలాగే నెల్లూరు జిల్లాల కమిటీలను రద్దు చేసిన అధినాయకత్వం, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీల బాధ్యతలను క్షేత్రస్థాయి క్యాడర్ కు అప్పగిస్తోంది. ఈ వరుస నిర్ణయాల కొనసాగింపుగానే ఇప్పుడు రాష్ట్రస్థాయి అధికార ప్రతినిధుల కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న 26 మంది అధికార ప్రతినిధుల బాధ్యతలను హైకమాండ్ ఉపసంహరించుకుంది. కొత్త కమిటీల నియామకం జరిగే వరకు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకూడదని కఠిన నిబంధనలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడమే ఈ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయి నుంచి నాయకులను చురుగ్గా ఉంచడానికి ఈ కఠినమైన నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పార్టీ భావిస్తోంది. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి యువతకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ వస్తున్నారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుత జెన్ జీ ట్రెండ్‌కి తగినట్లుగా పోరాటాలకు సిద్ధంగా ఉండే నాయకత్వాన్ని తయారు చేయాలని కోరుకుంటున్నారు. కొత్త తరపు గొంతుక పార్టీలో స్పష్టంగా వినిపించాలనే లక్ష్యంతో ఈసారి మరింత ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డ ఆయన కొత్త కమిటీల నియామకం పై సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నారు. ఈసారి కేవలం రాజకీయ నాయకులే కాకుండా చదువుకున్న విద్యాధికులతో పాటు ఐటీ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి తగిన స్థానం కల్పించడం ద్వారా ప్రజల్లోకి బలమైన సంకేతాలు పంపాలని చూస్తున్నారు. వచ్చే నెలలో ఈ కొత్త కమిటీల పూర్తి జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా పార్టీ భవిష్యత్తును మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అడుగులు పడుతున్నాయి. దేశ రాజకీయాలను ఇటీవల కాలంలో జెన్ జీ తరహా ఉద్యమాలు ఒక కుదుపు కుదిపేశాయి. ఆ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీలో యువతతో పాటు చదువుకున్న టెక్కీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలని సమాచారం అందుతోంది. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన నిపుణులు, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉన్న యువ నాయకులను ప్రోత్సహించి కీలక బాధ్యతలు అప్పగించాలని ఆలోచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తూ సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడమే ఈ కొత్త కమిటీల ప్రత్యేకతగా నిలవనుంది. కేవలం సాంప్రదాయ ధోరణులకు పరిమితం కాకుండా నేటి డిజిటల్ యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పవన్ కళ్యాణ్ కోరుకుంటున్నారు. ఈ ఆధునిక విధానం ద్వారా యువత పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షితులు అవుతారని, రాబోయే ఎన్నికలలో ఇది పార్టీ విజయానికి ప్రధాన భూమిక పోషిస్తుందని అంతా భావిస్తున్నారు. మార్పు అనేది ఎప్పుడూ ఒక మంచి పరిణామం అని నమ్మే పవన్ కళ్యాణ్, జనసేన పార్టీలో చేస్తున్న ఈ ప్రక్షాళన భవిష్యత్తు రాజకీయాలకు ఒక దిక్సూచి కానుంది. టెక్నాలజీ యుగంలో దూసుకుపోతున్న నేటి తరానికి తగినట్లుగా పార్టీ యంత్రాంగాన్ని సంస్కరించడం ద్వారా సమాజంలో సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతున్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ల మార్గదర్శకత్వంలోనే ఉంటూనే, నిర్ణయాలు తీసుకునే అధికారంలో యువతకు పెద్దపీట వేయడం ఈ కొత్త కమిటీల ప్రధాన ఉద్దేశం. రాబోయే కాలంలో జరగబోయే ప్రతి ఎన్నికను సవాల్‌గా తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జనసేన శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. త్వరలో ప్రకటించబోయే కొత్త రాష్ట్ర కమిటీ జాబితా రాజకీయ వర్గాలలో పెను మార్పులకు కారణం కానుంది. పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాలు పార్టీని ఏ విధంగా విజయతీరాలకు చేర్చుతాయనేది వేచి చూడాలి. ఏది ఏమైనా ఈ నిర్ణయం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# నైతిక డొల్లతనం మీద విద్యార్థుల తిరుగుబాటు



న్యూఢిల్లీ,ఇటీవల దేశాన్ని కుదిపేసిన విద్యార్థుల తిరుగుబాటు జెన్ జి (యువతరం) ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఎల్లెడలా వ్యాపించిన నిరుద్యోగ సమస్య, తీవ్ర స్థాయిలో సాగుతున్న అవినీతి, దానిలో భాగంగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీక్ లు, వాటి కారణంగా పరిమితంగానైనా ఉన్న అవకాశాలు దూరం కావడం ఈ ఆగ్రహానికి కారణాలుగా అందరూ విశ్లేషిస్తున్నారు. ఈ విశ్లేషణ సరైనదే అయినా, అది మాత్రమే చాలదు. ఒక 15 సంవత్సరాల అమ్మాయి తాను ఇంటిదగ్గర తల్లికి అబద్ధం చెప్పి జంతర్‌మంతర్ కు వచ్చానని ఒప్పుకుంది. అంత చిన్న వయస్సులో ఆమెను కలవరపరచినది కేవలం తన భవిష్యత్తు అవకాశాల లేమి మాత్రమేనా? కాదు. అంతకన్నా లోతైన అంశాలు ఉన్నాయి. ఈ జెన్ జి ఆందోళన దేశవ్యాప్తంగా అనేక నగరాలకు, పట్టణాలకు దానంతట అదే విస్తరించిందంటే అందుకు ప్రేరేపించిన అంశాలు లోతైనవి ఉన్నాయి. పాలకపార్టీ గాని, ప్రభుత్వం గాని వాటిని కనీసం గ్రహించగలిగే పరిస్థితి లేదు. ఇది 'రాజకీయ' ఆందోళన కాదన్నది స్పష్టమే. దానికి 'నాయకులు' లేరన్నదీ స్పష్టమే. 'నాయకులే' నడిపిన ఉద్యమం అయివుంటే భారతీయ జనతా పార్టీ అటువంటి 'నాయకుల'తో వ్యవహరించడంలో ఆరితేరింది. వాళ్ళ మధ్య చీలికలు తేవడం, వారిని అప్రదిష్టపాలు చేయడం, ప్రలోభాలకు గురి చేసి వాళ్ళని అవినీతిపరులుగా దిగజార్చడం, కొనివేయడం, అవినీతి నిరోధక శాఖ పేరుతోనో, విదేశీ నిధులను అక్రమంగా కలిగివున్నారనో వాళ్ళని బెదిరించడం వంటి పద్ధతులు బిజెపి కి కొట్టిన పిండి. ఈ ఉద్యమానికి 'నాయకులు' లేకపోవడంతో బిజెపికి ఆ పద్ధతులేవీ పారలేదు. అధికార పక్షంగా వాళ్ళ దగ్గర ఉన్న అన్ని అస్త్రాలనూ ప్రయోగించారు కాని అవన్నీ ఘోరంగా విఫలమయ్యాయి. సోనమ్ వాంగ్‌చుక్ తన నిరవధిక దీక్షను విరమించుకున్నా, అదేమీ ఉద్యమం మీద ప్రతికూల ప్రభావాన్ని చూపలేదు. మంత్రి జె.పి.నడ్డా ఇంటికి 'కాక్రోచ్' జనతాపార్టీ నాయకులు ఇద్దరు వెళ్ళి చర్చలు జరపడం కూడా విద్యార్థులకు ఆమోదయోగ్యంగా అనిపించలేదు. ముందస్తు షరతులు నిర్దేశించకుండా చర్చలు జరపడాన్ని విద్యార్థులు అంగీకరించలేదు. సాధారణంగా జరిగే ఉద్యమాల్లో "నాయకులు" తమ "అనుయాయుల" తరపున చర్చల్లో పాల్గొంటూ వుంటారు. కాని ఇక్కడ అలా జరగలేదు. ఇక్కడ విద్యార్థులు 'నాయకుల' వెనక కాకుండా కొన్ని షరతుల ప్రాతిపదికన (డిమాండ్ల) ఐక్యం అయ్యారు. వాటి విషయంలో ఎటువంటి రాజీకీ వారు సుముఖంగా లేరు. ప్రస్తుత ప్రభుత్వపు నైతిక డొల్లతనం పట్ల విద్యార్థులలో, యువతలో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. ఈ ఉద్యమం ఇంత సర్వవ్యాప్తంగా, ఎక్కడికక్కడ విస్తరించి చాలా స్వల్ప కాలంలోనే ఇంత మద్దతు పొందగలిగిందంటే దాని వెనుక ఉన్న లోతైన కారణం ఇదే. ఉద్యోగావకాశాలు సన్నగిల్లిపోవడమో, వరుసగా ప్రశ్నాపత్రాలు లీక్ కావడమో మాత్రమే ఇంత భారీ సంఖ్యలో జనాన్ని జంతర్‌మంతర్ దగ్గరికి చేర్చలేదు. వ్యవస్థలో 'జవాబుదారీతనం ' అన్నది లేకపోవడం వారిని కదిలించింది. వ్యవస్థలో ఇన్నిన్ని ఘోరమైన వైఫల్యాలు జరుగుతూవున్నా, వాటికి ఎవరూ బాధ్యత వహించడానికి సంసిద్ధం కాకపోవడంతో పాలకుల నైతిక డొల్లతనం పట్ల యువత ఆగ్రహించింది. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ వెనుక ఆ రాజీనామాతోటే ప్రశ్నాపత్రాల లీకేజి సమస్య పరిష్కరించబడుతుందనో, లేక దెబ్బ తిన్న విద్యా వ్యవస్థ చక్కబడుతుందనో ఎవరూ భ్రమపడలేదు. జంతర్ మంతర్ దగ్గర చేరినవారెవ్వరికీ అటువంటి భ్రమలు లేవు. కాని అతగాడి రాజీనామా విషయంలో వెనక్కి తగ్గేదే లేదన్న వైఖరి వాళ్ళు తీసుకున్నారు. వ్యవస్థలో ఏర్పడిన నైతిక డొల్లతనాన్ని అధిగమించడం కోసమే వారీ నిర్ణయం తీసుకున్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో ఎవరో కొంతమంది ఉన్నతాధికారులనో, ఆ దిగువస్థాయి ఉద్యోగులనో బాధ్యులుగా చూపించి అక్కడికి సరిపెట్టేయడాన్ని వాళ్ళు ఆమోదించలేదు. రాజకీయ వ్యవస్థలో ఎవరో ఒకరు దీనికి బాధ్యత వహించాల్సిందేనని పట్టుబట్టారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం మీద ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి బాధ్యులమీద చర్యల తీసుకుంటాం అని మోడీ ఇచ్చిన హామీ పని చేయలేదు. ప్రభుత్వం నైతికంగా బాధ్యత వహించాలన్న డిమాండ్ విద్యార్థుల్ని, యువతని -ఇంట్లో చెప్పకుండా పారిపోయివచ్చిన ఆ 15 ఏళ్ళ అమ్మాయితో సహా, పెల్లెట్ గన్నులను ఎదుర్కొన్న ధైర్యవంతులైన యువతీయువకులతో సహా, అందరినీ ఐక్యం చేసింది. ఈ నైతిక డొల్లతనం అనేది ప్రస్తుత ప్రభుత్వం నరనరాల్లోకీ ప్రవేశించింది. అది రాజకీయ వ్యవస్థ అంతటికీ ఒక అంటువ్యాధి మాదిరిగా విస్తరించింది. తమ పార్టీకి ఓటు వేయరేమో అన్న అనుమానంతో కోట్లాదిమంది పౌరులకు ఓట్లు లేకుండా చేయడం, అందుకోసం ఎన్నికల కమిషన్ ను వాడుకోవడం, అసలు ఆ ఎన్నికల కమిషన్‌ను ఏర్పరచడానికే అనైతిక పద్ధతులను ఉపయోగించడం ( ప్రధానమంత్రి, అతడు నామినేట్ చేసిన మరో వ్యక్తి ఎన్నికల కమిషన్ ను ప్రధానంగా నిర్ణయిస్తారు) ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చినా, వాటిని తారుమారు చేసేలా ప్రతిపక్ష సభ్యులను కొనివేయడం లేదా బెదిరించి వారిని తమవైపు తిప్పుకోవడం - ఈ పనులన్నీ ప్రజాస్వామ్యం ముసుగులోనే జరుగుతున్నాయి. ఈ నాటకాన్నంతటినీ విద్యార్థులు, యువజనులు చూస్తూనే వున్నారు, తమ వ్యతిరేకతను తెలియజేస్తూనే వున్నారు. ఒక పక్క పాలకవర్గ పెంపుడు జంతువు మాదిరిగా వ్యవహరిస్తూ 'గోడీ మీడియా' ఈ నాటకాన్ని ఆకాశానికి ఎత్తేస్తూంటే, మరోవైపు ఈ బండారాన్ని ప్రశ్నించకుండా ఉండేట్టు చాలామంది ప్రజానీకాన్ని భయభ్రాంతుల్ని చేస్తూ వచ్చారు. అటువంటి సమయంలో విద్యార్థులు ఈ దుర్మార్గాన్ని బహిరంగంగా ప్రశ్నించే దమ్ము చూపించారు. మోడీ భజన నంతటినీ అవహేళన చేస్తూ ప్రదర్శించిన పోస్టర్లు, కార్టూన్లు ఈ వ్యతిరేకతనే బహిర్గతం చేశాయి. దాంతోబాటు భయంతో చచ్చుబడిపోయిన అనేకమందిలో మళ్ళీ చలనాన్ని కలిగించాయి. నిజానికి ఈ ప్రభుత్వం దేనికీ చలించదు, వెనకడుగు వేయదు , దేనికైనా వెనకాడదు అన్న భయాన్ని ప్రజల్లో నిలబెట్టడానికే పోలీసులు ఆందోళనకారులపట్ల అంత కర్కశంగా వ్యవహరించారు. పెల్లెట్ గన్నులు, మేకులు దిగ్గొట్టిన లాఠీలను ప్రయోగించారు. బాష్పవాయువు ప్రయోగించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. ప్రజల్ని భయభ్రాంతుల్ని చేయడంతోబాటు వాళ్ళు ఎవరికి వారుగా విడి విడి వ్యక్తులుగా, ఏకాకులుగా భావించేట్టు ప్రభావితం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ఎవరికి వారు తమకేమీ చేతకాదని, తామేమీ చేయలేని అశక్తులమని భావిస్తూ, ప్రభుత్వం తిరుగులేని మద్దతుతో, బలంతో కొనసాగుతోందని భ్రమ పడుతూ చెదిరిపోతారని ఆశించింది. ఈ విధమైన నైతిక డొల్లతనం అన్ని ఫాసిస్టు ప్రభుత్వాలకూ ఉండే ఒక లక్షణం. 1930 దశకంలో జర్మనీలో ముందుకొచ్చిన నాజీ ఉద్యమం గుత్త పెట్టుబడి మీద కారాలు మిరియాలు నూరడంతో మొదలుపెట్టింది. కానీ ఆ ఉద్యమం వెనుక ఉన్నది కొంతమంది గుత్తపెట్టుబడిదారులే. అధికారంలోకి వచ్చాక అదే గుత్త పెట్టుబడిదారులతో ఒడంబడిక కుదుర్చుకుంది. అటువంటి ఒప్పందం కుదరడానికి వీలుగా తన సొంత అనుయాయులలో సైతం అనేకమందిని అది ఊచకోత కోయడానికి వెనుకాడలేదు. ఎర్నెస్ట్ రోమ్ నాయకత్వంలో గుత్త పెట్టుబడికి వ్యతిరేకంగా నిలిచిన తమ సహచరులను "విచ్చుకత్తుల విషమ రాత్రి" (నైట్ ఆఫ్ లాంగ్ నైవ్స్) లో బలి తీసుకుంది. గుత్త పెట్టుబడితో కూటమి కట్టడానికి సిద్ధపడింది. అది దాని నైతిక డొల్లతనానికి నిదర్శనంగా నిలిచింది.

# నేతన్నల ఇన్ స్టా బాట

న్యూఢిల్లీ, దేశ రాజకీయాల్లో ఇప్పుడు గాలి మారింది. ఒకప్పుడు ప్రెస్ మీట్లు, కరపత్రాలతో సాగిన రాజకీయం.. ఆ తర్వాత ఫేస్‌బుక్ కథనాలు, ఎక్స్ వార్లకు మారింది. కానీ ఇప్పుడు ఆ పాత వేదికలన్నీ బామ్మల కాలం నాటి ముచ్చట్లుగా మారిపోయాయి. పొలిటికల్ లీడర్లంతా ఇప్పుడు హుటాహుటిన ఇన్‌స్టాగ్రామ్ బాట పడుతున్నారు. కారణం ఒక్కటే.. ఓటర్లలో నిశ్శబ్దంగా పెద్ద శక్తులుగా మారుతున్న జెన్ జీ ఎక్స్ ను సమాచారం తెలుసుకోవడానికి వాడుకుంటున్నారు. ఫేస్‌బుక్‌కు అసలు గుడ్ బై చెప్పేశారు. వారు రోజంతా పడికాపులు కాసేది కేవలం ఇన్‌స్టా రీల్స్, షార్ట్స్ లోనే. అందుకే ఇప్పుడు రాజకీయం నడవాలంటే కుడిచేతి బొటనవేలితో స్వైప్ చేసే రీల్స్ పవర్ కావాల్సిందేనని నేతలు డిసైడ్ అయ్యారు. విషయం ఎంత తీవ్రంగా ఉందంటే.. ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా జెన్ జీ భాషలోనే సంభాషించడానికి ఇన్‌స్టా వేదికగా ఫ్రంట్-కెమెరా సెల్ఫీ వీడియోలు , రీల్స్ పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. 10.5 కోట్లకు పైగా ఫాలోవర్లతో డిజిటల్ స్పేస్‌లో ట్రెండ్ సెట్ చేస్తున్న ప్రధాని నుంచి మొదలుకొని, స్థానిక వార్డు మెంబర్ దాకా అందరూ ఇన్‌స్టా అల్గారిథమ్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ట్విట్టర్ అనేది కేవలం ప్రెస్ రిలీజ్ పోస్ట్ చేసుకునే ఆఫీస్ బోర్డుగా మారిపోగా.. ప్రచారాన్ని, వ్యక్తిత్వాన్ని వైరల్ చేసుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్ ఒకే ఒక్క అస్త్రంగా మారింది. యువతను ఆకట్టుకోవాలంటే వారి మైండ్ సెట్‌కు తగ్గట్టుగా కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో పొలిటికల్ వార్ రూమ్‌లు కూడా ఇప్పుడు పిఆర్ ఏజెన్సీలతో రీల్స్ ప్రాజెక్టులు డిజైన్ చేయిస్తున్నాయి. దశాబ్దాలుగా పొడుగాటి పంచెలు, మైకులు పట్టుకుని ఐదు పేజీల మైక్ ఉపన్యాసాలు దంచేసే పాతతరం రాజకీయ నేతలకు.. ఈ 15 సెకన్ల రీల్స్ లాజిక్ అర్థం కాక చమటలు పడుతున్నాయి. జెన్ జీని మెప్పించడం కోసం కెమెరా ముందుకొచ్చి నిలబడటం, కుర్రాళ్లతో కలిసి ట్రెండింగ్ ఆడియోలకు హావభావాలు ఇవ్వడం, నేరుగా ఫోన్ వంక చూస్తూ హేయ్ గైస్ " అని పలకరించడం.. పాపం మన పొలిటీషియన్లకు పెద్ద అగ్నిపరీక్షలా మారింది. సెల్ఫీ యాంగిల్ సరిగ్గా కుదరక, మాట్లాడే స్టైల్ మోతాదు మించడంతో అనేక మంది నేతల ప్రయోగాలు మీమర్స్ కి కడుపుబ్బ నవ్వించే డైలీ కంటెంట్‌గా మారిపోతున్నాయి. మరోవైపు ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్ చాలా విచిత్రమైనది. అక్కడ గంభీరమైన రాజకీయ ప్రసంగాలు చెల్లవు. జెన్ జీకి నచ్చే సరదా స్లాంగ్ , పాప్ కల్చర్ ట్రెండ్స్, కట్-షార్ట్ ఎడిటింగ్ లేకపోతే ఆ రీల్‌ను క్షణాల్లో పైకి నెట్టేస్తారు. దీంతో పొలిటికల్ పార్టీల సోషల్ మీడియా వింగ్స్.. తమ లీడర్లను ఇన్‌ఫ్లుయెన్సర్లు గా మార్చేందుకు తంటాలు పడుతున్నాయి. ఏ నాయకుడు ఏ బ్రాండ్ టీషర్ట్ వేసుకున్నారు, ఏ కాఫీ షాప్‌లో కూర్చున్నారు, యువతతో కలిసి ఎలాంటి ఫన్నీ కౌంటర్లు వేశారనే కట్-షాట్స్ కోసం ఏకంగా కెమెరా టీమ్‌లను వెంటబెట్టుకుని తిరుగుతున్నారు. నాన్-స్టాప్ పొలిటికల్ పోరాటాల కంటే రీల్స్‌కు వచ్చే లైకులు, కామెంట్లు, షేర్లే ఇప్పుడు నాయకుల పవర్‌ను కొలిచే కొలమానంగా మారాయి. ఓటు బ్యాంకు కోసం లీడర్లు పడే తిప్పలు ఇప్పుడు కేవలం వీధుల్లో పాదయాత్రలకే పరిమితం కాలేదు.. ఇన్‌స్టా స్క్రీన్ల పైకి చేరాయి. జెన్ జీ ఓటర్లను ఆకట్టుకోవడానికి అలవాటు లేని పనులు చేస్తూ, కుర్రాళ్ల ట్రెండ్స్‌ను అనుకరిస్తూ రాజకీయ నాయకులు పడుతున్న ఆర్గానిక్ అవస్థలు సామాజిక మాధ్యమాల్లో రక్తికట్టిస్తున్నాయి. ఎంత కష్టమొచ్చినా సరే.. ట్రెండింగ్ లో లేకపోతే రాజకీయంలో ఉనికికే ప్రమాదమని గుర్తించిన నేతలు, అలవాటు లేని ఈ ఇన్‌స్టా దారిలో కిందామీదా పడుతూ పయనించక తప్పడం

## అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్

ఖమ్మం,తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ఖమ్మం జిల్లా అంజనాపురంలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడితో 113.5 ఎకరాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. మలేసియా భాగస్వామ్యంతో దేశంలోనే తలమానికంగా నిలిచే సీడ్ గార్డెన్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మరో ఆరు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రముఖ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం గ్రామపంచాయతీలో ఈ మెగా ప్రాజెక్టును నిర్మించింది. దాదాపు రూ.300 కోట్ల భారీ పెట్టుబడితో 113.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సమీకృత పరిశ్రమను ఈ నెల 20న ప్రారంభించేందుకు సంస్థ సర్వ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఆహ్వానించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 700 మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమలో ఇప్పటికే నర్సరీ కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతుండగా.. దాదాపు మూడు లక్షల మొక్కలను పెంచుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1.40 లక్షల మేలైన మొక్కలను రైతులకు సరఫరా చేశారు. ఈ పరిశ్రమ పరిధి కిందికి సంగారెడ్డి జిల్లాతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 12 మండలాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ సరికొత్త ఫ్యాక్టరీతో తెలంగాణలో ఆయిల్‌పామ్ పరిశ్రమల సంఖ్య నాలుగుకు చేరుకోనుంది. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని అప్పారావుపేటలో గంటకు 90 టన్నులు, అశ్వారావుపేటలో గంటకు 30 టన్నులు, సిద్దిపేట జిల్లా నర్మెటలో గంటకు 30 టన్నులతో కర్మాగారాలు నడుస్తుండగా.. అంజనాపురం కర్మాగారం గంటకు 15 టన్నుల సామర్థ్యంతో అందుబాటులోకి వస్తోంది. ఇదే కాకుండా కల్లూరుగూడెం, బీచ్‌పల్లి, ఇంచర్ల, పెద్దరాత్‌పల్లి, సంకిరెడ్డిపల్లి, యాచారంలలో నిర్మాణ దశలో ఉన్న మరో ఆరు కర్మాగారాలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టులో ఏర్పాటు కానున్న సీడ్ గార్డెన్ దేశానికే తలమానికంగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మలేసియా కంపెనీ భాగస్వామ్యంతో గోద్రెజ్ సంస్థ ఈ విత్తన తోటను అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. దీని ద్వారా రైతులకు తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాల విత్తనాలు లభిస్తాయని ఇవి అంతర్గత పంటల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రైవేటు సమీకృత పరిశ్రమ రాకతో తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం మరింత వేగంగా పెరగనుందని ఆయన వెల్లడించారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా అధిక లాభాలను ఇచ్చే వాణిజ్య పంటలను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు.

### కత్తిపోట్లతో వ్యక్తి దారుణ హత్య

నిర్మల్,మామడ మండలం పోతారం గ్రామం నందు నిన్న అర్ధరాత్రి కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. కత్తిపోట్ల ఘటనలో గ్రామానికి చెందిన పెద్దోల్ల లింబాద్రి (45) కత్తి పోట్లకు గురయ్యాడు, వెంటనే గమనించిన గ్రామస్తులు తీవ్రంగా గాయపడిన లింబాద్రిని 108 అంబులెన్స్ లో నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు, పరీక్షించిన వైద్యులు అప్పటికే లింబాద్రి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భూ తగాదాల నెపథ్యంలో ఈ హత్య జరిగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లింబాద్రి అన్న పెద్దోళ్ళ భూమన్న కత్తితో పొడిచి హత్య చేసినట్టు తెలుస్తోంది పోలీసులు కేసు నమోదు చేసుకుని హత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. లింబాద్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి మార్చురీకి తరలించారు

# బాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేందుకు.. ఆ ఐపీఎస్ రెడీ!

అమరావతి,తప్పుడు కేసులో ఇరికించి, నెలల తరబడి జైల్లో ఉంచిన సీఎం చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారి ఎదురు చూస్తున్నారు. పదవీ కాలం పూర్తవగానే, రాజకీయంగా వైసీపీ కోసం పని చేయడానికి ఎదురు చూస్తున్న ఆ ఐపీఎస్ అధికారే పీఎస్ఆర్ ఆంజనేయులు. ఈ నెల 31న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. అనంతరం ఆయన భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. తనను అన్యాయంగా జైలుకు పంపిన సీఎం చంద్రబాబును గద్దె దించే వరకూ విశ్రమించకూడదనే పట్టుదలతో ఉన్నట్టు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఉన్నతాధికారుల్ని వేధించిన పాపానికి, వాళ్లతో తీవ్రమైన కసి పుట్టిందనేందుకు పీఎస్ఆర్ ఆంజనేయులు లాంటి అధికారుల్ని ఉదహరించుకోవచ్చు. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యల్ని ఎంతోకొంత అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ రాజకీయాల్లో సర్వసాధారణం అని సరిపెట్టుకోవచ్చు. కానీ ప్రభుత్వ ఉద్యోగులు, మరీ ముఖ్యంగా ఐపీఎస్ అధికారులపై రాజకీయ ముద్ర వేసి, వెంటాడి, వేటాడి జైలుకు పంపిన చరిత్ర బహుశా ఆంధ్రప్రదేశ్‌కే సొంతమనే చర్చ జరుగుతోంది. వైసీపీ హయాంలో సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును వివిధ ఆరోపణలపై సస్పెండ్ వరకే పరిమితం అయ్యారు. ఆయన్ను జైలుకు పంపేంత దుస్సాహసానికి వైసీపీ ప్రభుత్వం పాల్పడలేదు. కానీ కూటమి ప్రభుత్వం ఏకంగా ఐపీఎస్ అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు పీఎస్ఆర్‌ను జైలుకు కూడా పంపడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ముంబయ్ నటి కాదంబరీ జెత్వానీ కేసులో నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ కమిషనర్ కాంతిరాణా టాటా, విశాల్ గున్నీలపై సీఐడీ ఎలా వ్యవహరించిందో తెలిసిందే. కాదంబరీ జెత్వానీ కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు రిమాండ్‌లో వుండగానే, ఏపీపీఎస్సీలో అక్రమాలకు బాధ్యుడంటూ పీఎస్ఆర్‌పై అభియోగాలు మోపారు. ఈ కేసులో కూడా ఆయన రిమాండ్‌లో ఉన్నారు. ఇలా రెండు కేసుల్లో దాదాపు రోజుల తరబడి జైలు జీవితాన్ని పీఎస్ఆర్ అనుభవించారు. ఇటీవల జెత్వానీనే అసలు కిలాడీ అంటూ సీఐడీ తేల్చేసిన సంగతి తెలిసిందే. ఏపీపీఎస్సీ అక్రమాలకు సంబంధించి హైకోర్టులో విచారణ సాగుతోంది. కానీ



జెత్వానీ ఫిర్యాదుపై సీనియర్ ఐపీఎస్ అధికారి ఆంజనేయుల్ని అన్యాయంగా జైల్లో వేశారనే విషయాన్ని సీఐడీ విచారణ నివేదికే తేల్చి చెప్పింది. రాజకీయ కక్షతో జైల్లో వేసిన సీఎం చంద్రబాబు ప్రభుత్వాన్ని పీఎస్ఆర్ ఆంజనేయులు ఎప్పటికీ మరిచిపోలేరు. అందుకే ఆయన పదవీ విరమణ తర్వాత, రాజకీయంగా వైసీపీకి సాయపడేందుకు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఐపీఎస్ అధికారి అయిన తననే జైలుకు పంపిన తర్వాత, ఇక పోగొట్టుకోడానికి ఏమీ లేదన్న భావనలో పీఎస్ఆర్ ఉన్నట్టు తెలుస్తోంది. తనను అన్యాయంగా జైలుకు పంపిన వారిని ఊరికే విడిచిపెట్టొద్దనే పట్టుదలతో పీఎస్ఆర్ ఉన్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. దీంతో రానున్న రోజుల్లో వైసీపీకి అంతర్గతంగా కీలక వ్యవహారాలు చూడాలనే అభిప్రాయంతో ఉన్నట్టు తెలుస్తోంది. బాబు సర్కార్‌పై తనలాగే కసితో రగులుతున్న వివిధ వర్గాల ప్రముఖుల్ని గుర్తించడం, వాళ్లందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి, పని చేయించడానికి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని సమాచారం. కూటమి బాధితులంతా పీఎస్ఆర్‌ను కలుసుకునే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా పోలీస్ వ్యవస్థతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల్లో కూటమి బాధితులు ఎక్కువగా ఉన్నట్టు చెబుతున్నారు.

# మూడింట రెండు ఓడిపోయిన బీజేపీ..ఇది జెన్‌జీ ఎఫెక్టా?



న్యూఢిల్లీ, దేశంలోని గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో (మంజల్‌పూర్, దాతియా, బంకీపూర్) మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ కూటమి అధికారంలోకి ఉంది. అయితే, ఈ ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెల్లడికాగా.. రెండు రాష్ట్రాల్లో బీజేపీకి పరాభవం తప్పలేదు. కేవలం గుజరాత్‌లో మాత్రమే బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓడిపోవటం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఓటమికి కారణం స్థానిక కారణాలతోపాటు.. ఇటీవల జరిగిన జెన్‌జీ ఉద్యమ ప్రభావం కూడా కారణమై ఉండొచ్చునని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్ మూడుచోట్లా బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. అయినా, రెండు రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓడిపోవటం బీజేపీకి పెద్ద దెబ్బగానే భావించాలి. అయితే, అది జెన్‌జీ వల్లే అయిందా? అంటే ఔనని చెప్పలేం. అలాఅని, కాదని కూడా చెప్పలేం. ఎందుకంటే.. బీహార్ రాష్ట్రంలోనూ నిరసనలు చాలా గట్టిగానే జరిగాయి. స్టూడెంట్స్ నిరసనలు, జెన్‌జీ ఉద్యమంతో ప్రభావితం అయిన వాళ్లు బీజేపీకి వ్యతిరేకంగా ఓటువేసి ఉండొచ్చు. అయితే, జెన్ జీ ఓటర్లు ఆ రెండు నియోజకవర్గాల్లో ఎంతమంది ఉన్నారనేది లెక్కతీస్తేనేగానీ.. జెన్ జీ ఉద్యమం వల్లనే బీజేపీ అభ్యర్థులు ఓడిపోయారని చెప్పగలం. ఇదిలాఉంటే.. ఎన్నికలు జరిగిన జులై 30వ తేదీ నాటికి జంతర్ మంతర్ వద్ద నిరసనలకు ఫుల్ స్టాప్ పడింది. కానీ, ఆ ప్రభావం కొంతకాలం ఉంటుంది. కాబట్టి మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని రెండు నియోజక వర్గాల్లో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఓడిపోయి ఉండొచ్చునని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అయితే, ఎక్కువ శాతం మాత్రం స్థానిక ప్రభుత్వాల ఫెయిల్యూర్ గా భావించాలని, అందుకు కొంతశాతం జన్ జీ ఉద్యమం, ఆయా రాష్ట్రాల్లో స్టూడెంట్స్ నిరసనలు కారణం అయ్యి ఉండొచ్చునని పేర్కొంటున్నారు. మొత్తానికి రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉండికూడా ఆ రెండు చోట్ల ఉపఎన్నికల్లో ఓడిపోవటం బీజేపీకి బిగ్ షాకేనని చెప్పొచ్చు.

మూడు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల ఫలితాలు ఇలా..

– గుజరాత్ రాష్ట్రం వడోదర జిల్లాలోని మంజల్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి సతీష్ పటేల్ సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భిఖాభాయ్ రబారిపై 30వేల ఓట్లకుపైగా మెజార్టీతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థికి 55,084 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి రబారికి 24,585 ఓట్లు పోలయ్యాయి.

– మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గంకు జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ విజయం సాధించారు. ఆయనకు 66,757 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి ఆశుతోష్ తివారికి 60,741 ఓట్లు పోలయ్యాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ సుమారు 6016 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ఎన్నికల సంఘం డేటా ద్వారా తెలుస్తోంది.

–బీహార్ రాష్ట్రంలోని బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంకు జరిగిన ఉపఎన్నికల్లో జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ విజయం సాధించాడు. తద్వారా బీజేపీ కంచుకోటను ఆయన బద్దలు కొట్టారు. తొలి రౌండ్ నుంచి ఆధిక్యం ప్రదర్శించిన ప్రశాంత్ కిషోర్.. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై 18,964 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు అడ్డాగా పేరొందిన ఈ నియోజకవర్గంలో దాదాపు 30ఏళ్ల తర్వాత బీజేపీ ఓటమిపాలవ్వడం గమనార్హం.

# రాజకీయ పార్టీల వైరల్ స్ట్రాటజీ మారాల్సిందే!



బెంగళూర్ :కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొన్న సీఎం మార్పు, తదనంతర కేబినెట్ విస్తరణ పరిణామాలు కాంగ్రెస్ అధిష్ఠానానికి, ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక పెద్ద పాఠాన్ని నేర్పుతున్నాయి. పొరుగు రాష్ట్రంలో డీకే శివకుమార్ నేతృత్వంలో కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసి 20 మందిని కేబినెట్‌లోకి తీసుకున్నప్పటికీ, పదవులు దక్కని సీనియర్లు రాజీనామా బాట పట్టడం తీవ్ర అల్లకల్లోలానికి దారితీసింది. ఆ అలకల తుఫాను ను చల్లార్చడానికే అక్కడ నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ల తాయిలాలు అంటూ పెద్ద కసరత్తే చేయాల్సి వస్తోంది. సరిగ్గా ఈ పరిణామాలను గమనించిన తర్వాతే, తెలంగాణ కాంగ్రెస్ నేతలు కూడా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

మంత్రి పదవుల కోసం డజన్ల కొద్దీ ఆశావహులు

కర్ణాటకలో పరిస్థితి వేరు, అక్కడ ముఖ్యమంత్రి మారడంతో కొత్త టీమ్‌ను ఎంపిక చేయడం అనివార్యమైంది. కానీ, తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు ప్రసక్తే లేదు; కేవలం ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీ లేదా కొంతమందిని తొలగించి కొత్తవారికి అవకాశం ఇవ్వడమే ప్రస్తుత చర్చ. సీఎం మార్పు కంటే మంత్రుల మార్పు–చేర్పులు మరింత రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం. ఎందుకంటే, అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా కేబినెట్‌లో ఇంకా ఒక్క ఖాళీ మాత్రమే ఉంది. ఒక్కదాని కోసం ఉమ్మడి జిల్లాల వారీగా, సామాజిక సమీకరణల ప్రాతిపదికన డజన్ల కొద్దీ ఆశావహులు పోటీ పడుతున్నారు.

కొంత మందిని తొలగిస్తే ఇంకా రచ్చ

ఒకవేళ కేబినెట్‌లో చోటు పెంచేందుకు ఉన్నత స్థాయిలో రీషఫుల్ చేసి, ప్రస్తుతం ఉన్న కొందరు మంత్రులను తప్పించి కొత్తవారికి అవకాశమిస్తే, ఆ పరిణామాలు ఊహించని రాజకీయ సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉంది. పదవులు కోల్పోయిన మంత్రులు ఊరికే ఉండరు సదా అసంతృప్తితో రగిలిపోతారు. అలాగే, ఉన్న రెండు ఖాళీలను భర్తీ చేసినా.. పదవులు రాని మిగిలిన పదుల సంఖ్యలోని ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు శాంతించే ప్రసక్తే ఉండదు. కొందరికి ఇస్తే ఇతరుల్లో అభద్రతాభావం, అసమ్మతి పెరిగి అది పరోక్షంగా పార్టీ క్రమశిక్షణకే చేటు తెస్తుంది.

ఊరుకుంటే బెటర్

కర్ణాటక పరిణామాల తర్వాత తెలంగాణ కాంగ్రెస్ హైకమాండ్, సీఎం రేవంత్ రెడ్డి మరింత అప్రమత్తమయ్యారని భావించవచ్చు. ప్రభుత్వంలో పాలన సాఫీగా సాగుతున్నప్పుడు, అనవసరంగా కేబినెట్ విస్తరణ జోలికి వెళ్ళి పాత, కొత్త నేతల మధ్య అసంతృప్తి జ్వాలలను రాజేసుకోవడం ఎంతవరకు శ్రేయస్కరమనే కోణంలో తీవ్రంగా ఆలోచిస్తున్నారు. ఖాళీలను భర్తీ చేయకపోతే వచ్చే నష్టం కంటే, భర్తీ చేసి పార్టీలో అంతర్గత పోరును కొనితెచ్చుకుంటే జరిగే నష్టమే ఎక్కువని భావిస్తున్నారు. అందుకే తెలంగాణలో కేబినెట్ విస్తరణ పర్వం తాత్కాలికంగా మూలనపడే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి. కర్ణాటక కాంగ్రెస్‌లో చెలరేగిన విభేదాలు, రాజీనామాలు ప్రత్యక్షంగా కళ్లముందు కదులుతున్న వేళ, అనవసరపు రిస్క్ తీసుకోవడానికి అధిష్ఠానం సుముఖంగా లేనట్లే సంకేతాలు వెలువడుతున్నాయి.

# బీహార్ రాజకీయాల్లో ఇక బీజేపీ వర్సెస్ పీకే శకం!

పాట్నా:దశాబ్దాలుగా బీహార్‌ను ఏలిన లాలూ ప్రసాద్ యాదవ్ , నితీష్ కుమార్ ల మూస రాజకీయాల కథ దాదాపు కంచికి చేరినట్లే కనిపిస్తోంది. బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఫలితాలు బీహార్‌లోని సాంప్రదాయ ప్రాంతీయ పార్టీల పునాదులను తీవ్రంగా కదిలించాయి. మూడు దశాబ్దాల పాటు సాగిన మండల్ వర్సెస్ కమండల్ సమీకరణలు రాబోయే రోజుల్లో పనిచేయవనే సందేశాన్ని ఈ ఉపఎన్నిక స్పష్టంగా ఇచ్చింది. ఇప్పుడు బీహార్ రాజకీయాలు సరికొత్త మలుపు తిరుగుతూ, అధికార బీజేపీకి నేరుగా ప్రశాంత్ కిషోర్ జన్ సురాజ్ పార్టీ ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కుంగిపోతున్న ఆర్జేడీ ఓటు బ్యాంక్

ఆర్జేడీ నమ్ముకున్న సాంప్రదాయ ఓటు బ్యాంక్ గణనీయంగా పడిపోవడం వెనుక ప్రధానంగా జెన్ జీ యువత వైఖరి మార్పే కారణం. పాత తరం నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయ శైలిని గానీ, తేజస్వి యాదవ్ అందించే పాతకాలపు సామాజిక న్యాయం నినాదాలను గానీ ప్రస్తుత కొత్త తరం ఓటర్లు విశ్వసించే స్థితిలో లేరు. కేవలం కుల ఆధారిత రాజకీయాల చుట్టూ తిరిగే ఆర్‌జేడీ విధానాలు నచ్చక యువత ఆ పార్టీని తిరస్కరిస్తోంది. బంకీపూర్‌లో ఆర్జేడీ డిపాజిట్ కోల్పోయే స్థాయికి రావడం, కేవలం 14 వేల చిల్లర ఓట్లకు పరిమితమవ్వడం ఆ పార్టీ ఓటు బ్యాంకులో సంభవించిన భారీ విస్తరణ లోపాన్ని, జెన్–జీ యువత దూరమవ్వడాన్ని ఎత్తిచూపుతోంది.

నితీష్ రిటైర్మెంట్‌తో ఉనికి కోల్పోతున్న జేడీయూ

ఇక మరోవైపు జేడీయూ పరిస్థితి నితీష్ కుమార్‌తోనే ముగిసిపోయేలా కనిపిస్తోంది. నితీష్ కుమార్ వయోభారం కారణంగా పరోక్ష రాజకీయాలకు వెళ్లిపోవడం, ఆయన ఆరోగ్యం వంటి కారణాలతో జేడీయూ క్యాడర్ దిక్కుతోచని స్థితిలో పడింది. నితీష్ తర్వాత పార్టీని నడిపించే రెండో శ్రేణి బలమైన నాయకత్వం జేడీయూలో లేకపోవడమే ఆ పార్టీకి శాపంగా మారింది. నితీష్ కుమార్ రాజకీయ నిష్క్రమణ, ప్రాభవం తగ్గడంతోనే జేడీయూ తన ఉనికిని




కోల్పోయి నిర్వీర్యం కావడం ఖాయమని పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం సాగుతోంది. ఈ శూన్యాన్ని భర్తీ చేసేందుకు అర్బన్, గ్రామీణ ఓటర్లు రెండింటినీ ఆకర్షించే సరికొత్త నాయకత్వం వైపే మొగ్గు చూపుతున్నారు.

ప్రశాంత్ కిషోర్ ఒకే ఒక్క విశ్వసనీయ ప్రత్యామ్నాయం

ఈ పరిణామాలన్నింటి మధ్య ప్రజలకు, ముఖ్యంగా అభివృద్ధిని కోరుకునే యువతకు ప్రశాంత్ కిషోర్ ఒకే ఒక్క విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నారు. తన జన్ సురాజ్ పాదయాత్ర ద్వారా ఏళ్ల తరబడి గ్రామగ్రామాన తిరిగి, విద్యావంతులు, ఉద్యోగ ఆశావాహులు, వ్యాపార వర్గాలతో అనుసంధానమైన తీరు ఆయనకు మైలేజ్ ఇచ్చింది. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను ఆర్జేడీ లేదా కాంగ్రెస్ దక్కించుకోలేకపోతున్న వేళ, పీకే ఎంచుకున్న పసుపు జెండా, విద్యా–ఉపాధి ఆధారిత రాజకీయాలు ఓటర్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. పాత నేతల అవినీతి, పక్షపాత రాజకీయాలతో విసిగిపోయిన ప్రజలు పీకే సిద్ధాంతాల్లో నిజమైన మార్పును చూస్తున్నారు. లాలూ కుటుంబ వారసత్వ రాజకీయం, నితీష్ కుమార్ అవకాశవాద రాజకీయం ముగింపు దశకు చేరుకోగా, ప్రశాంత్ కిషోర్ సరికొత్త విజన్‌తో ముందుకు రావడం బీహార్‌ను 30 ఏళ్ల పాత కూపం నుంచి బయటకు తెచ్చే సంకేతంగా కనిపిస్తోంది.

# ముందస్తు ఎన్నికలు అంటూ ప్రచారం...ఎందుకలా ?



న్యూఢిల్లీ,దేశంలో బీజేపీ మూడవసారి వరసగా అధికారం అందుకుంది. అయితే లోటు ఏమిటి అంటే బీజేపీకి పూర్తి మెజారిటీ దక్కలేదు. 240 నంబర్ దగ్గరే ఆగిపోయింది. మ్యాజిక్ ఫిగర్ అయిన 273 కి 33 సీట్లు పక్కాగా తగ్గాయి. అయితే ఎన్డీయే మిత్రులు మంచి సంఖ్యతో సీట్లు సాధించడంతో మూడవసారి మోడీ ప్రధాని అయ్యారు. అయితే బీజేపీ పెద్దలకు ఇది ఒక అసంతృప్తిగానే ఉందని అంటున్నారు. ఇక 2024 నుంచి చూసుకుంటే దేశంలో జరిగిన పలు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచి జెండా గట్టిగా పాతింది.

చాప కింద నీరులా :

పశ్చిమ బెంగాల్ లో బీజేపీ గెలుస్తుందని ఎవరూ అనుకోలేదు. అలాంటి చోట కూడా 200 ప్లస్ సీట్లతో అదిరిపోయే సక్సెస్ ని సొంతం చేసుకుంది. బీహార్ లో తమ పార్టీ నేతను ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోబెట్టింది. ఇన్ని జరిగినా బీజేపీ మీద ఉన్న అసంతృప్తి మెల్లగా జనంలో ఎక్కడో ఒక చోట బయటపడుతూనే ఉంది. తాజాగా బీహార్ లోని బకింపూర్ ఉప ఎన్నికల ఫలితం అయితే బీజేపీకి భారీ షాక్ కొట్టించింది. దాంతో పాటు ఇటీవల ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఆందోళన అయితే బీజేపీని డిఫెన్స్ లో పడేసింది. ఏకంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. జెన్ జీ తరం ఆగ్రహంగా ఉందని అర్థం అవుతోంది అంటున్నారు. దాంతో బీజేపీ పెద్దలలో అంతర్మథనం మొదలైంది అన్న మాట వినిపిస్తోంది.

డీలిమిటేషన్ బిల్లు సంగతి :

ఇక బీజేపీ ఎన్నో ఆశలు పెంచుకుని ఈసారి ఎలాగైనా డీలిమిటేషన్ బిల్లుని పార్లమెంట్ లో ఆమోదించుకోవాలని చాలా వ్యూహ రచన చేసింది. అనేక పార్టీలను చీల్చింది. కొన్ని పార్టీలను దగ్గర చేసింది. ఇంత చేసినా వర్షాకాల పార్లమెంట్ నడవడం లేదు, పైగా మద్దతుగా నిలుస్తుంది అనుకున్న డీఎంకే కూడా హ్యాండ్ ఇచ్చింది అని అంటున్నారు. ఈ పరిణామాల పట్ల బీజేపీ పెద్దలు అసంతృప్తిగా ఉన్నారని అంటున్నారు. డీలిమిటేషన్ బిల్లు కనుక ఆమోదం పొందితే ఆటోమేటిక్ గా మహిళా బిల్లు పొందుతుంది. అపుడు వచ్చే ఏడాది జరగనున్న యూపీ తదితర రాష్ట్రాల ఎన్నికలను వాయిదా వేయించి డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టిన తరువాతనే నిర్వహించాలని అనుకున్నారు. ఎందుకంటే పదేళ్ళ పాటు బీజేపీ యూపీలో అధికారంలో ఉంది. దాంతో అక్కడ యాంటీ ఇంకెంబెన్సీ ఎక్కువగా ఉందని అంటున్నారు. అయితే ఇపుడు ఆ చాన్స్ ఏదీ లేదని అంటున్నారు. ఎందుకంటే డీలిమిటేషన్ బిల్లు ముందుకు వెళ్ళేందుకు ఆస్కారం పార్లమెంట్ లో లేదని విశ్లేషిస్తున్నారు.

యూపీ ఎన్నికలు జరిగితే :

ఇక వచ్చే ఏడాది ప్రథమార్థంలో యూపీ ఎన్నికలు జరిగితే కనుక బీజేపీకి చేదు ఫలితాలు వస్తాయన్న ఆందోళన ఉంది. అదే జరిగితే కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం మీద ఆ ప్రభావం పడుతుందని అసలే మెజరిటీ తక్కువై మిత్రులతో ప్రభుత్వాన్ని నడుపుతున్న బీజేపీ పెద్దలకు అన్ని వైపుల నంచి కొత్త్ తలనొప్పులు వస్తాయన్న అంచనాలు కూడా ఉన్నాయి. దీంతో డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందని వేళ కొత్త వ్యూహాలకు బీజేపీ పెద్దలు తెర తీస్తారా అన్న చర్చ సాగుతోంది. అందులో నుంచి పుట్టుకుని వచ్చిందే ఈ ముందస్తు ఎన్నికల ప్రచారం

రెండేళ్ళు ముందుగానా :

యూపీ ఎన్నికలతోనే లోక్ సభకు కూడా ఎన్నికలు జరిపించాలని ఒక ఆలోచన కేంద్ర బీజేపీ పెద్దలకు ఉందని ఊహాగానాలు అయితే ప్రచారంలో ఉన్నాయి. ఆ విధంగా చేయడం ద్వారా జాతీయ అంశాలను యూపీలో ముందుంచి మరోసారి అక్కడా కేంద్రంలో గెలించేందుకు బీజేపీ ప్రణాళికలు రూపొందించవచ్చు అన్నది అయితే ప్రచారంలో ఉన్న మాటగా చెబుతున్నారు. అయితే రెండేళ్ళ ముందు ఎన్నికలు పెట్టినా అనుకున్నది జరగకపోతే అపుడు రెండిందాలుగా కూడా చెడిన తీరు అవుతుందని అంటున్నారు. పైగా ముందస్తు అంటే మిత్రులతో పాటు అంతా ఒప్పుకోవాల్సి ఉంటుందని కూడా గుర్తు

# మూడు నెలల క్రితం సీఎం.. అప్పుడే నలుగురు మంత్రులపై వేటు?

చెన్నై:తమిళనాడుకు దళపతి విజయ్ రూపంలో అత్యంత చురుకైన, దూకుడు స్వభావం గల ముఖ్యమంత్రి లభించాడు. తమిళనాడులో తన మొట్టమొదటి ఎన్నికల్లోనే ఆయన అద్భుతమైన విజయం సాధించడం, ముఖ్యమంత్రి పీఠం ఎక్కడం తెలిసిందే కదా. ఆ తర్వాత తీసుకున్న నిర్ణయాలు కూడా చాలా పటిష్టంగా ఉన్నాయి. విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి కేవలం మూడు నెలలే అయింది. కానీ ఆయన అప్పుడే ఎన్నో కొత్త పనులు చేస్తున్నాడు. రాజకీయ అనుభవం లేకపోవడంతో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలపై విమర్శలు వస్తున్నాయి. విమర్శల సంగతి పక్కనపెడితే ...మొదటి మూడు నెలల్లోనే నలుగురు క్యాబినెట్ మంత్రులను తొలగిస్తున్నట్లు సమాచారం. దీంతో ఇప్పుడు ముఖ్యమంత్రి క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల తర్వాత ముఖ్యమంత్రి విజయ్ తన మొదటి క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేపడతారు. ఇందులో పనితీరు సమీక్ష ఆధారంగా నలుగురు మంత్రులను తొలగించే అవకాశం ఉంది. ఉన్నత విద్యాశాఖ మంత్రి పి. విశ్వనాథన్, రవాణా శాఖ మంత్రి ఎ. విజయ తమిళన్ పార్థిబన్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కె. జగదేశ్వరి, మానవ వనరుల నిర్వహణ శాఖ మంత్రి డి. శరత్‌కుమార్‌లను తొలగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి కేవలం మూడు నెలలు మాత్రమే అయినప్పటికీ, అప్పుడే నలుగురు మంత్రుల మీద వేటు వేయడానికి ధైర్యం చేయడం విచిత్రంగా ఉంది. సాధారణంగా, ముఖ్యమంత్రులు ఇలాంటి పరిస్థితుల పట్ల అత్యంత సున్నితంగా ఉంటారు. ఎందుకంటే మంత్రులను తొలగిస్తే వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే అలాంటి పని చేయడానికి భయపడతారు. కానీ విజయ్ రాజకీయ సమీకరణాలను ఏమాత్రం పట్టించుకోనట్లుగా కనిపిస్తున్నాడు. క్యాబినెట్‌లో మార్పులు చేస్తే ఎక్కడ తిరుగుబాటు వస్తుందో అనే భయం చాలామంది నేతల్లో ఉంటుంది. విజయ్ మాత్రం రాజకీయ సమీకరణాల కంటే ప్రజల సంక్షేమం, సమర్థవంతమైన పాలనే ముఖ్యమని భావిస్తున్నాడు. ఈ నిర్ణయం ద్వారా ఆయన తన పార్టీ నేతలకు ఒక బలమైన హెచ్చరిక పంపాడు. పదవి అనేది హక్కు కాదు, కేవలం ప్రజలకు సేవ చేసే ఒక బాధ్యత మాత్రమే అని ఆయన స్పష్టం చేశాడు. ఈ రకమైన వ్యూహం ఆయనను ఇతర సాంప్రదాయ రాజకీయ నాయకుల కంటే



చాలా భిన్నంగా నిలబెడుతోంది. విజయ్?కి రాజకీయ అనుభవం తక్కువగా ఉన్నప్పటికీ, పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాడు. పాత పద్ధతులను పక్కన పెట్టి, ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం ఆయన శైలిగా మారింది. రాబోయే రోజుల్లో రాష్ట్ర భవిష్యత్తును సరికొత్తగా తీర్చిదిద్దడానికి ఆయన ఒక బలమైన పునాది వేస్తున్నాడు. యంగ్ జనరేషన్‌కి నచ్చేలా ఆయన పాలనా శైలి చాలా ఉత్సాహంగా, వేగంగా ఉంటూ తమిళనాడు రాజకీయ రంగాన్ని సరికొత్త మలుపు తిప్పుతోంది. విజయ్ నిర్ణయాలు తమిళనాడు రాజకీయ సమీకరణాలను వేగంగా మార్చివేస్తున్నాయి. ఆయన అంతర్గత సమీక్షల ఆధారంగా మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల నుండి వచ్చిన అభిప్రాయ సేకరణ ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటున్నాడు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ, ప్రతి మంత్రిత్వ శాఖ పనితీరుపై నిరంతరం డేటాను విశ్లేషిస్తున్నాడు. ఈ తరహా కార్పొరేట్ తరహా పనితీరు రాజకీయాల్లో చాలా అరుదుగా కనిపిస్తుంది. సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ, నిర్ణయాధికారంలో ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా సొంతంగా వ్యవహరిస్తున్నాడు. పాతకాలపు రాజకీయ నాయకులలాగా ఆచితూచి అడుగులు వేయడం కాకుండా, వేగవంతమైన నిర్ణయాలతో సంచలనం సృష్టిస్తున్నాడు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడమే ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నాడు. ఈ మార్పుల వల్ల ప్రభుత్వ యంత్రాంగం కూడా మరింత చురుగ్గా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ఆయన మొదటి

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140